నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మేడ్చల్: కిష్టాపూర్ సబ్ స్టేషన్ లో మరమ్మతుల కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుండి రాత్రి 7 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు మేడ్చల్ అర్బన్ ఏఈ రాంబాబు తెలిపారు. కిష్టాపూర్ పరిధిలోని అర్చన కాలనీ, కిష్టాపూర్ విలేజ్, వీకర్‌సెక్షన్ కాలనీ, ఐడీఏ హనుమాన్, టైం టెక్నో, వెల్ సెట్ ప్రాంతాలలో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ వివరించారు.

నూతన కార్యవర్గం ఏర్పాటుతో సమస్యల పరిష్కారం

కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, నాగర్జుననగర్ కాలనీ సంక్షేమసంఘం అధ్యక్షుడిగా యావపురం రవి నియామితులయ్యారు. ఆదివారం జరిగిన సమావేశంలో ఆయనను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అందరి సహకారంతో కాలనీ అభివృద్ధి, సమస్యల సాధనకు కృషి చేస్తానన్నారు. తనపై విశ్వాసంతో అధ్యక్షుడిగా ఎన్నుకున్న కాలనీవాసులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధాన కార్యదర్శిగా కరుణాకర్‌రెడ్డి, కోశాధికారిగా బొల్లంపల్లి శ్రీకాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సయ్యద్ సాదిక్, బైరంకొండ గోపాల్‌యాదవ్, మచ్చ మహేందర్‌గౌడ్‌తో పాటుగా సాయివివేక్, శ్రీశైలం, వెంకటేష్‌గౌడ్, నాగరాజు, మహ్మద్ జహంగీర్ పాషా, కొండల్‌రెడ్డికి కమిటీలో ఉన్నారు.

నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం..

ఉప్పల్: ఉప్పల్ భగాయత్‌లోని ఆత్మగౌరవ భవన్‌లో సోమవంశ సహస్రార్జున క్షత్రియ ప్రాంతీయ సమాజ్ నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. ఆదివారం రాష్ట్ర నూతన కమిటీని ఎన్నుకోగా.. కమిటీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆర్టీసీ ముఖ్య కార్యనిర్వహణాధికారి డా.విశ్వనాథ్ , రవీందర్, ఉపాధ్యక్షులు నాగురావు నామాజీ, శ్రీనివాసరావు నియమితులయ్యారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు



మల్కాజిగిరి: ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ అనంతసరస్వతీనగర్‌లోని జ్ఞాన సరస్వతీ అమ్మవారి దేవాలయం 21వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిశాయి. చివరిరోజు అమ్మవారికి శత ఘటాభిషేకం, లక్షపుష్పార్చన, అలంకరణ, పూర్ణాహుతి, అమ్మవారి ఊరేగింపు ఘనంగా జరిగింది. అర్చకులు రాజశేఖరశర్మ, సాయి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్, ఆలయ చైర్మన్ హరీష్, ఈవో రవీందర్‌రెడ్డి, ధర్మకర్తలు మంగమ్మ, రాఘవేంద్రచారి, గోపీనాథ్, బాలస్వామి, శ్రీకాంత్, బుచ్చిబాబు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

పేదలకు మెరుగైన సేవలు అందించాలి

మల్కాజిగిరి: పేదలకు మెరుగైన సేవలందించి గుర్తింపు తెచ్చుకోవాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ అన్నారు. ఆదివారం బీజేఆర్‌నగర్‌లో ఇ – ఉమర్ డయాగ్నస్టిక్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధునిక జీవన విధానంలో జీవన శైలితో పాటు ఆహారపు అలవాట్లు మారిపోయాయన్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే తరచూ కనీస వైద్యపరీక్షలు చేయించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సత్యమూర్తి,బాబు, మసీదు కమిటీ సభ్యులు వాజిద్ అలీ, షాజిద్‌హుస్సేన్, మహ్మద్ రఫీ, అస్లాం, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



బోడుప్పల్: కమల హాస్పిటల్, గాయత్రీనగర్ ఫేస్– 1 సంయుక్తాధ్వర్యంలో ఆదివారం లక్ష్మీనగర్ హుడాపార్కు వద్ద ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్ ప్రారంభించారు. 250 మందికి వైద్య పరీక్షలకు హాజరు కాగా.. వారికి జనరల్ ఫిజీషియన్, గైనకాలజిస్ట్, పల్మనాలజీ, ఆర్థోపెడిక్, ఫిజియోథెరపీ, బీపీ, షుగర్, కంటి పరీక్షలు నిర్వహించారు. నాయకులు హరినాథ్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ నవీన్‌కుమార్, కాలనీ అధ్యక్షుడు లింగరాజు, ప్రధాన కార్యదర్శి మధుయాదవ్, వైద్యులు పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

పోచారం: తాళం వేసిన ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన సంఘటన శనివారం రాత్రి చోటు చేసుకుంది. పోచారం ఇన్‌స్పెక్టర్ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మక్తలోని చంద్రారెడ్డి ఎన్‌క్లేవ్‌లో ధారావత్ మౌనిక తన భర్త ముగ్గురు పిల్లతో కలిసి నివాసం ఉంటోంది. ఆమె భర్త శనివారం పనికి వెళ్లగా, పెద్ద కొడుకుకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో మౌనిక ఇంటికి తాళం వేసి హాస్పిటల్‌కు తీసుకెళ్లింది. తిరిగి వచ్చేలోగా గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లో చొరబడి నగలు, నగదు దోచుకెళ్లారు. సుమారు రూ. 75 వేల సొత్తు చోరీకి గురైనట్లు బాధితురాలు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆహ్లాదం.. ఆనందం

అన్ని సౌకర్యాలతో ప్రజలకు అందుబాటులో లక్ష్మీనగర్ పార్కు

ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేయిమంది రాక

నిత్యం పర్యవేక్షణలో మున్సిపల్ అధికారులు



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని లక్ష్మీనగర్(హుడా) పార్కు ప్రజలకు ఆహ్లాదం, ఆనందాన్ని పంచుతుంది. హుడా నిధులు, గ్రీన్ బడ్జెట్ కింద పార్కును అన్ని రకాల మొక్కలతో సుందరంగా అభివృద్ధి చేశారు.



అందమైన పూల మొక్కలతో..

పచ్చని చెట్లు, అందమైన పూల మొక్కలు, పిల్లల ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. ప్రతిరోజు ఉదయం, సాయంత్రం వేళల్లో వేయిమందికి పైగా పార్కులో సేద తీరుతున్నారు. వాకర్లు, యోగాసనాలు అభ్యసించేవారు, ఆటలు ఆడేవారు, కిడ్స్ జోన్‌లో పిల్లలను ఆడించేవారు ఈ పార్కుకు వస్తున్నారు. వారంతా ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదం పంచుకుంటూ ఆనందాన్ని నింపుకుంటున్నారు. మున్సిపల్ అధికారుల పర్యవేక్షణలో ప్రజల అవసరాలకు అనుగుణంగా అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు.

హుడానిధులు రూ. 40 లక్షల వ్యయంతో..

లక్ష్మీనగర్ (హుడా) పార్కు మూడెకరాల స్థలంలో విస్తరించి ఉంది. హెచ్‌ఎండీఏ నిధులు రూ.40లక్షల వ్యయంతో ముందుగా అభివృద్ధి చేశారు. అందులో భాగంగా వివిధ రకాల మొక్కలతో పాటు ఔషధ మొక్కలు, పూల మొక్కలను నాటారు. అంతే కాకుండా సెల్ఫీ పాయింట్ వ్యూ లాగా మొక్కలను పెంచారు. వాకింగ్ ట్రాక్‌ను పునర్నిర్మాణం చేసి చుట్టూ పూల మొక్కలను ఏర్పాటు చేశారు.

గ్రీన్ బడ్జెట్ కింద రూ.కోటి నిధులతో..

లక్ష్మీనగర్ పార్కును గ్రీన్ బడ్జెట్ కింద అభివృద్ధి చేసేందుకు రూ.35 లక్షలు కేటాయించారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ.70 లక్షలతో ఆటవస్తువులు, షటిల్ కోర్టు నిర్మాణం, పార్కు ప్రహరీ, పెయింటింగ్, ముఖద్వారం ఆర్చీ నిర్మాణ పనులను చేపట్టారు. గతంలో ప్రజలు సేద తీరేందుకు మూడు షెడ్‌లు నిర్మించారు. వాటిలో సేద తీరడంతో పాటు యోగాసనాలు నేర్పిస్తున్నారు. ప్రతిరోజు ఉదయం 5 గంటల నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 7 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేశాం..



బోడుప్పల్ నగర ప్రజలు సేద తీరే విధంగా పార్కును అభివృద్ధి చేశాం. అన్ని రకాల చెట్లు, పూల మొక్కలు, చిన్న పిల్లలకు కిడ్జ్‌జోన్ ఏర్పాటు చేశాం. ప్రజలు పార్కును పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేయాలి. ఇష్టానుసారంగా వ్యర్థాలు పారవేయకుండా డస్ట్‌బిన్స్‌ను వినియోగించుకోవాలి.

– శైలజ, కమిషనర్ బోడుప్పల్

ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం



ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మేడ్చల్: అసెంబ్లీలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అవమానించినందుకు నిరసనగా ఆదివారం మేడ్చల్‌లో కాంగ్రెస్ నాయకులు ఆదివారం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అంతకు ముందు జాతీయ రహదారిపై ఎమ్మెల్యే దిష్టిబొమ్మను ఊరేగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి స్పీకర్‌కు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్‌గౌడ్, వరదారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, బాలమల్లేష్, కొడె మహేష్, రాజు, రాకేష్, శివశంకర్, సత్యనారాయణ, చాపరాజు, మర్రి శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

దమ్మాయిగూడ పరిధిలో..

కీసర: రాష్ట్ర శాసన సభ స్పీకర్ గడ్డంప్రసాద్‌కుమార్‌ను బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అసెంబ్లీలో అవమానించినందుకు నిరసనగా ఆదివారం దమ్మాయిగూడ మున్సిపాలిటీలో కాంగ్రెస్ నేతలు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ పార్టీనేతలు మాట్లాడుతూ స్పీకర్ గడ్డంప్రసాద్ ఉద్దేశించి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు అనైతికమన్నారు. బీఆర్‌ఎస్‌కు ప్రజలు ఎన్నికల్లో బుద్ధిచెప్పినా వారిలో మార్పు రాకపోవడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర ప్రజలందరు బీఆర్‌ఎస్ నేతల తీరును గమనిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు ముప్పరామారావు, శ్వేతాముదిరాజ్, సామల శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, శ్రావన్‌రెడ్డి, సోమెష్, సంజీవరెడ్డి, శోభారాణి, ముప్పశ్రీలత, సంతోష్‌గౌడ్, గోవింద్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

భవానీ రామలింగేశ్వర స్వామికి ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి పూజలు



భవానీ రామలింగేశ్వర స్వామి సేవలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

కీసర: కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వర స్వామికి ఆదివారం ఇటీవల జరిగిన ఉమ్మడి నల్గొండ , వరంగల్, ఖమ్మం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన పింగిలి శ్రీపాల్‌రెడ్డి పూజలు చేశారు. ఉదయం ఆలయానికి వచ్చిన ఎమ్మెల్సీకి వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి అభిషేక పూజ అనంతరం ఆలయ మండపంలో అర్చకులు ఎమ్మెల్సీ దంపతులకు స్వామివారి ఆశీర్వచనంతో పాటు, మహాప్రసాదాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంతోపాటు, పీఆర్‌టీయూను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులగం దామోదర్‌రెడ్డి ,మేడ్చల్ జిల్లా అధ్యక్షులు రామేశ్వర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, నాయకులు చీర యాదగిరి, ఈగ శ్రీనివాస్, ఎంఈఓ శశిధర్, తదితరులు పాల్గొన్నారు.

చర్చికి సౌండ్ సిస్టం అందజేత



ఆడియో సౌండ్ సిస్టం అందజేస్తున్న జాన్ వెస్లీ

కీసర: బోగారంలోని సర్వశక్తుని ప్రార్థన మందిరానికి ఆంధ్రప్రదేశ్ వైఎస్‌ఆర్‌సీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు, క్రిష్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొల్లవరపు జాన్ వెస్లీ మైక్ ఆడియో సౌండ్ సిస్టం అందించారు. ఆదివారం చర్చిలో జరిగిన కార్యక్రమంలో వీటిని అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారి ఇవాన్ శామ్యూల్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేశారు. తల్లిదండ్రులు చిన్నప్పటి నుంచే పిల్లలను సన్మార్గంలో నడిపించాలని జాన్ వెస్లీ సూచించారు. ప్రార్థన, బైబిల్ చదవడం, చర్చికి వెళ్లడం అలవాటు చేయాలన్నారు. ఈ సందర్భంగా పారుపల్లి ప్రసాద్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్ రూతమ్మ, బొల్లవరపు ప్రభు, ఆశలత, అహరోనిక, లక్ష్మి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేపై ఫిర్యాదు



అల్వాల్: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా అల్వాల్ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నేతలు ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యేపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరామన్నారు. కాంగ్రెస్ నేతలు నిమ్మ అశోక్‌రెడ్డి, సీఎల్.యాదగిరి, సురేందర్ రెడ్డి, కృష్ణగౌడ్, బలవంత్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి, వీనస్‌మేరీ, పద్మ, నిర్మల, జ్యోతి పాల్గొన్నారు.

ఏసీఎల్-3 విజేత రామ్ సేనా జట్టు



షీల్డ్ అందజేస్తున్న రాజమహేందర్‌గౌడ్

ఘట్‌కేసర్: అంకుషాపూర్ క్రికెట్ లీగ్ –3 విజేతగా గ్రామానికి చెందిన రామ్ సేనా జట్టు నిలిచింది. గ్రామంలో ఆదివారం జరిగిన తుది పోరులో రామ్ సేనా జట్టు అంకుషాపూర్ టైటాన్స్‌తో తలపడి విజయం సాధించింది. విన్నర్ రామ్ సేనా జట్టుకు గ్రామానికి చెందిన బత్తుల రాజమహేందర్‌గౌడ్, బత్తుల పవన్‌కుమార్‌గౌడ్ రూ. 10 వేలు, రన్నర్ జట్టుకు మేడబోయిన రాజుముదిరాజ్ రూ. రూ. 5 వేలు నగదు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఏసీఎల్-3 నిర్వాహకులు గణేశ్‌ముదిరాజ్, నరేశ్, స్థానికులు గోపాల్‌రెడ్డి, మంగారెడ్డి, ఆంజనేయులుగౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఘట్‌కేసర్: ఎన్‌ఎఫ్‌సీ నగర్‌లో సన్ రైజ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సాధురామ్ కంటి ఆస్పత్రి వైద్యులు 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. బోడుప్పల్ లోరా ఆస్పత్రి వైద్యులు ఫిజియో థెరఫీ, ఆక్యూ పంక్చర్ తదితర సేవలు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవసరమైన వారికి కంటి శస్త్ర చికిత్సలు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు సుందరరావు, కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి ఐలయ్య, సభ్యులు దేవానంద్‌గౌడ్, వీరారెడ్డి, బాబు, కృష్ణ. మాజీ కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, రమాదేవి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, లింగస్వామి, శరబంధ, స్థానికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న బీమా మోడ్కే , శంకర్ అకాంబ్లే

ఘట్‌కేసర్: భారతరత్న అంబేడ్కర్ ఆశయసాధనకు కృషి చేయాలని అన్నోజీగూడ సామ్రాట్ యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భీమా మోడ్కే, వైస్ ప్రెసిడెంట్ శంకర కాంబ్లే అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంబేడ్కర్ ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌కు రాజ్యాంగం అందించారన్నారు. మహనీయుల జీవిత చరిత్రను నేటి యువత తెలుసుకుని వారి ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ రాంరెడ్డి, దాసు, రాధాకృష్ణ ముదిరాజ్, సురేష్‌నాయక్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, యాదగిరి, రాజేశ్‌కుమార్, జగదీశ్, శ్రీరామ్, గణేశ్, మహిపాల్ పాల్గొన్నారు.

నేటి నుంచి కరుమారియమ్మ బోనాల ఉత్సవాలు



కరుమారియమ్మ అలయంలో కొలువైన అమ్మవారు

కీసర: కీసరగుట్ట అటవీ ప్రాంతంలోని తమిళుల ఆరాధ్య దైవమైన కరుమారియమ్మ బోనాల ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. బోనాల ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజైన సోమవారం ఉదయం కరగతీర్థం ఉత్సవం, మంగళవారం బోనాల ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

పద్మశాలీల అభివృద్ధికి కృషి



కాశీనాథ్, చెన్నప్పను సత్కరిస్తున్న దృశ్యం

బోడుప్పల్: పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి చేద్దామని ఆలిండియా పద్మశాలీ సత్రాల చైర్మన్ సిలివేరు కాశీనాథ్, మాజీ ప్రొఫెసర్ చెన్నప్ప అన్నారు. బోడుప్పల్‌లో ఆదివారం నిర్వహించిన పద్మశాలీల ఆత్మీయ సమ్మేళనానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పద్మశాలీలు ఐక్యంగా ఉండి ఆర్థిక, సామాజిక, రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేద్దామన్నారు. పద్మశాలీలు ఆర్థికంగా వెనకబడిన వారికి తమవంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. బోడుప్పల్ పద్మశాలీ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు సాయిని అమృతం, అధ్యక్షుడు వెంకటేశం, ఉపాధ్యక్షులు సత్యనారాయణ, శ్రీనివాస్, కార్యదర్శి మధుమోహన్, ప్రతినిధులు విజయ్‌కుమార్, నర్సింగ్‌రావు, సమ్మయ్య, ఉపేందర్, డాక్టర్ లక్ష్మీ వీరమల్లు తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ అభివృద్ధికి సహకరించండి



ఎంపీ ఈటలతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మల్కాజిగిరి డివిజన్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ శ్రవణ్ ఎంపీ ఈటల రాజేందర్‌కు విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఎంపీని కలిసిన అనంతరం మాట్లాడుతూ.. వేసవిని దృష్టిలో ఉంచుకుని డివిజన్ పరిధిలో పవర్‌బోర్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కోరినట్లు చెప్పారు. రాజీవ్‌నగర్ కాలనీవాసులు రైల్వే విభాగంతో భూవివాదం ఉందని, సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. కాలనీలో పర్యటించిన అనంతరం సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారన్నారు. కాలనీవాసులు యాకుబ్‌రెడ్డి, ప్రదీప్, మహేందర్, మౌనిష్, అశోక్, చెన్నారెడ్డి పాల్గొన్నారు.

కారు డ్రైవర్ అదృశ్యం



సాయిరామ్ (ఫైల్)

జవహర్‌నగర్: ఓ కారు డ్రైవర్ అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. హకీంపేట గాంధీ విగ్రహం ప్రాంతానికి చెందిన సాయిరామ్ (23) కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 15న ఇంటి నుండి బయటికి వెళ్లి అతను తిరిగిరాలేదు. అతడి కోసం గాలించినా ఫలితం లేకపోవడంతో అతడి తల్లి మాధవి జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నీళ్లు ఇస్తారా... ధర్నా చేయమంటారా.?



మిషన్ భగీరథ డీఈతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీలో ప్రజలు తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి మల్లారెడ్డి ఆరోపించారు. మున్సిపాలిటీకి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు అత్తెల్లి సందీప్‌గౌడ్ నాయకులతో కలిసి ఆదివారం ఎమ్మెల్యే మల్లారెడ్డి ఇంటికి వెళ్లి పట్టణ ప్రజలు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నల్లాల ద్వారా నీరు సరఫరా చేయడం లేదని చెప్పారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి మిషన్ భగీరథ డీఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. సరైన సమాధానం రాకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హయాంలో ఎప్పుడూ రాని నీటి సమస్య ఇప్పుడు ఎందుకు వస్తుందని నల్లాల ద్వారా మంచినీరు సరఫరా చేయకుండా ప్రజలను ఎందుకు ఇబ్బందులకు గురి చేస్తున్నారని ప్రశ్నించారు. వారం రోజులుగా ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎందుకు పరిష్కారం చూపడం లేదంటూ నిలదీశారు. వెంటనే నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని డీఈ హామీ ఇచ్చారు.